## శిఖం భూమి పై సమాచారం ఇవ్వాలని ఫిర్యాదు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

మాచారెడ్డి, మార్చి 17 : మండల కేంద్రంలోని ఊర చెరువు శిఖం భూమి వివరాలు తమకు సమాచార హక్కు చట్టం ద్వారా ఇవ్వాలని కోరుతూ బాధితుడు అజీజ్ సోమవారం తహసీల్దార్ శ్వేతకు ఫిర్యాదు చేశాడు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'తండాలో ఏం జరుగుతున్నది' అనే శీర్షికన ఈ నెల 4న ప్రచురితమైన కథనానికి స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు 5 న శిఖం భూమికి సంబంధించి సర్వే చేశారు. ఇంత వరకు సర్వే రిపోర్ట్‌ను అధికారులు బయటికి వెల్లడించకపోవడంతో బాధితుడు మరోసారి సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు అందించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఊర చెరువు విస్తీర్ణం ఎంత, అందులో శిఖం భూమి, ఎక్‌ఫసల్ పంట ఎంత మంది సాగు చేస్తున్నారు. ఎంత మంది రైతులకు పట్టాలు అందించారు. ఆక్రమణకు గురైన శిఖం భూమి పూర్తి వివరాలతో అందించాలని బాధితుడు ఫిర్యాదు చేయగా పదిరోజుల్లో వివరాలు అందిస్తానని తహసీల్దార్ చెప్పినట్లు అజీజ్ వివరించారు.

## పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేయాలి




మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం

కామారెడ్డి, మార్చి 17 : పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చింతల లింగం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం టీపీటీఎఫ్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఎనిమిది కోట్ల రూపాయల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, గతంలో ఏనాడులేని విధంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు, ఉద్యోగులకు నగదు రహిత వైద్యం తదితర హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వాసు, నళినిదేవి, నాగభూషణం, విజయశ్రీ, లక్ష్మి, శ్రీవాణి, కృష్ణమూర్తి, రాజశేఖర్, కృష్ణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

మాచారెడ్డి, మార్చి 17 : పాల్వంచ మండల కేంద్రంలోని గ్రామ శివారులోని పోచమ్మ ఆలయం వద్ద పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వారి నుంచి రూ.3,338లతోపాటు రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. గ్రామాల్లో పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

బాన్సువాడ రూరల్, మార్చి 17 : పదోతరగతి వార్షిక పరీక్షలు ఎలాంటి మాల్‌ప్రాక్టిస్‌కు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ గౌడ్ సోమవారం మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆయన వెంట బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దత్తు ఉన్నారు.

# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 145 ఫిర్యాదులు

కామారెడ్డి,మార్చి 17 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవె న్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 145 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, జడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

కామారెడ్డి, మార్చి 17 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థి సేన ఆధ్వర్యంలో 'ఫ్రమ్ క్యాంపస్ టూ కెరీర్' అనే అంశంపై సెమినార్ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యంగ్ ఎంటర్‌ప్రీనర్ విస్పోర్ట్ అండ్ ఏబీసీ ఏడీ టెక్ ఫౌండర్ అండ్ సీఈవో దిల్మిత్ చాదా హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని, స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ రమేశ్, చైతన్య, ఇందర్ దీప్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బీబీపేట్, మార్చి 17 : మండలంలోని మాందాపూర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06 పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజుంతా ఉల్లాసంగా గడిపారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు.

## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలి

కామారెడ్డి, మార్చి 17 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్షలు సోమవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. గ్రూప్-1, 2, 3 వర్గీకరణ చేసే వరకు పేపర్ రిలీజ్ చేయొద్దని సూచించారు. నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సాయిలు, సత్తిగారి లక్ష్మి, పురుషోత్తం, నయీం, సతీశ్, రాజు, బాబు, శివ తదితరులు పాల్గొన్నారు.



ఐదో రోజు నిరసన తెలియజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## బాధిత కుటుంబాలకు పరామర్శ

నస్రుల్లాబాద్, మార్చి 17 : నస్రుల్లాబాద్‌లో బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శంకర్ కుమారుడు ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాలను బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నర్సింహులుగౌడ్, సాయిలు, సాయికుమార్, అఫ్రోజ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## సిద్దిపేట్‌కు ఎలక్ట్రికల్ బస్సులు

ఖలీల్‌వాడి, మార్చి 17 : నిజామాబాద్, కామారెడ్డి నుంచి సిద్దిపేట్ వరకు నూతనంగా ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నట్లు నిజామాబాద్ -2 డిపో డీఎం సాయన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్-2 డిపో నుంచి ఉదయం 5.45, 6.30, 7.15, 14.15, 15.15, 15.45 గంటలకు, సిద్దిపేట్ నుంచి ఉదయం 9.30, 10.15, 11.00, 18.00, 19.00, 19.30 బస్సు ట్రిప్పులు ఉంటాయని వివరించారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

బాన్సువాడ రూరల్, మార్చి 17 : ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని చిన్నరాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరప్ప సూచించారు. సోమవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు సంజీవ్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నక్క ప్రవీణ్, గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, అంజయ్య, చంద్రశేఖర్‌గౌడ్, విఠల్, బాపురెడ్డి, నర్సింహారెడ్డి, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

**పరీక్ష సామగ్రి అందజేత**

బీబీపేట్/మాచారెడ్డి/కామారెడ్డి/బాన్సువాడ, మార్చి 17: బీబీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీగాధ శంకర్ పరీక్ష సామగ్రిని అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. పాల్వంచ మండలం భవానీపేట జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ రమేశ్‌గౌడ్, మాచారెడ్డి మండలం సోమార్‌పేటలోని జడ్పీహెచ్ఎస్‌లో బంజారా టైగర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో సేవా భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. మాజీ కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు మంచాల శ్రీనివాస్, పోసానిపేట వనిత, సేవా భారతి కార్యకర్తలు మంచాల రాజు, జంపాల శ్రీనివాస్, తాటిపాముల సంజీత్, భూంపల్లి భూపాల్, అరవింద్ పాల్గొన్నారు. జుక్కల్ మండలం పెద్ద ఏడ్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జుక్కల్ యూత్ ఫోరం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు అందజేశారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి, మార్చి 17 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం మొత్తం 38 సెంటర్లల్లో పరీక్షలు నిర్వహించారు. ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్-1కు మొత్తం జనరల్ 8,217 మందికిగాను 7,964 మంది హాజరయ్యారని 253 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఒకేషనల్ 2,086 మందికిగాను 1,928 మంది హాజరయ్యారని, 158 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

## నోటిఫికేషన్ విడుదల

కామారెడ్డి, మార్చి 17 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అనుబంధ కార్యాలయమైన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సి ల్ సిస్టం ఆఫీస్‌లో ఆఫీస్ ప్యూన్ కాంట్రాక్ట్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కామారెడ్డి డిస్ట్రిక్ట్ కోర్టులో తెలుసుకోవాలని సూచించారు. ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## కొలతల పరిశీలన

బాన్సువాడ రూరల్, మార్చి 17 : మండలంలోని నాగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇచ్చిన కొలతలను డీఎల్పీవో సత్యనారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. నాగారంలో ఎంపీడీవో బషీరుద్దీన్‌తో కలిసి గ్రామంలో ఆయన పర్యటించారు. లబ్ధిదారులు ఇండ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శులు నవీన్‌గౌడ్, సృజన్‌రెడ్డి, పండరి ఉన్నారు.

## జీవితంపై విరక్తిచెంది వ్యక్తి ఆత్మహత్య

నస్రుల్లాబాద్, మార్చి 17 : బాన్సువాడకు చెందిన కొత్తకొండ శ్రీనివాస్(53) నస్రుల్లాబాద్‌లోని గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. శ్రీనివాస్ టైలరింగ్ పని చేసేవాడని, కొన్ని రోజుల నుంచి విరిగిన కాలు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి పోయాడని, జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. భార్య అనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

## టిప్పర్ బైక్ ఢీ : ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్, మార్చి 17 : నస్రుల్లాబాద్ మండలం కంశెట్‌పల్లి శివారులో టిప్పర్, బైక్ ఢీ కొనడంతో బాన్సువాడ మండలం రాంపూర్‌కు చెందిన హరి సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

## సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

నస్రుల్లాబాద్, మార్చి 17 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సీసీ రోడ్డు పనులకు సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు సాయిబాబా, హన్మంత్‌రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగలను పట్టుకున్న పోలీసులు

నిజాంసాగర్, మార్చి 17 : మేదరి భూమవ్వ అనే మహిళను శనివారం నిజాంసాగర్ నుంచి ఆటోలో తీసుకెళ్లి బంగారు, వెండి నగలు దొంగిలించిన నిందితులను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం బాన్సువాడ రూరల్ సీఐ టి.రాజేశ్ తన సిబ్బందితో బొగ్గు గుడిసె ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఒక ఆటో అక్కడికి వచ్చి పోలీసులను చూసి పారిపోతుండగా, ఆటోను పట్టుకుని, అందులో ఉన్న పోలో జాక్సన్ సుందర్ రాజు, వడ్డే లక్ష్మిని విచారించారు. నిజాంసాగర్‌లో ఓ వృద్ధురాలిని శనివారం బాచేపల్లి శివారుకు తీసుకెళ్లి ఆమె దగ్గర నుంచి బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించామని వారు ఒప్పుకున్నారు. పోలీసులు వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలతోపాటు ఆటోను స్వాధీనం చేసుకుని, వారిని కోర్టులో హాజరుపర్చామని సీఐ పేర్కొన్నారు. కేసు ఛేదించిన నిజాంసాగర్ ఎస్సై శివకుమార్, సిబ్బంది శ్యామ్, మహేశ్‌ను సీఐ అభినందించారు.

## రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

నిజాంసాగర్, మార్చి 17: మండలంలోని నర్సింగ్‌రావుపల్లి వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. హైవే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం నర్సింగ్‌రావుపల్లి నుంచి పిట్లం వైపు బైకుపై వెళ్తున్న వ్యక్తిని మరో బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో నర్సింగ్‌రావుపల్లికి చెందిన రమేశ్ గౌడ్‌కి గాయాలయ్యాయని, అంబులెన్సులో పిట్లం ప్రభుత్వ దవాఖానకు తరలించామన్నారు.

## ఆవుల యజమానులపై పోలీసులకు ఫిర్యాదు

లింగంపేట, మార్చి17: మండల కేంద్రానికి చెందిన ఆవుల యజమానులపై పలువురు రైతులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆవుల యజమానుల నిర్లక్ష్యం కారణంగా యాసంగిలో సాగు చేస్తున్న వరి పంటను రాత్రి పూట ఆవులు మేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆవుల యజమానులైన చేపూరి కృష్ణమూర్తి, శెట్పల్లి రాములు, మంగలి విఠల్, పోతాపల్లి సాయిలుపై చర్యలు తీసుకొని, పంటలు కాపాడాలని కోరారు. రైతులు వెంకట్‌గౌడ్, గురుప్రసాద్, నామాల లక్ష్మణ్, చింతకుంట సాయిలు, దరావత్ ఆలీయ, కాశీరాం, బాలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### రామారెడ్డి తహసీల్దార్ బదిలీ

రామారెడ్డి, మార్చి17 : రామారెడ్డి తహసీల్దార్ సువర్ణ బాన్సువాడకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కామారెడ్డి కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉమలతను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నేడోరేపో ఆమె వి ధుల్లో చేరుతారని సమాచారం.

**BEFORE THE HONBLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD**

**ABR NO.312 OF 2024**

**Between:**

Jashu Chit Fund Pvt.Ltd. Kamareddy represented by its Branch Manager Mr.D.Krishna Hari .... Disputant

And

S.Mahesh and others ... Opponents

**To,**

**Opp No.2** K.Rajagoud S/o. Balraja Goud, aged about 39 years, Occ: Police Constable-758, R/o. H.No.1-22/1, Vill: Sitarampur, Mdl: Domakonda, Dist: Kamareddy

Opp.No.3 D.Suresh Goud S/o. Venkat Goud, aged about 34 years, Occ: Police Constable-465, R/o. H.No.6-33/1, Vill & Mdl: Bibipet, Dist.Kamareddy.

The Disputant has filed the dispute for recovery of amount and notices sent on your addresses are returned unserved. Whereas the dispute is posted for your appearance on 26.03.2025 at 11.00 A.M. you are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits/ Arbitrator Nizamabad on the said date failure of which the dispute will be heard and decided expartee.

// By Order of the Deputy Registrar of Chits/ Arbitrator //

**Sd/- Deputy Registrar of Chits/ Arbitrator, Kavitha Complex, Nizamabad.**

# సమయపాలన పాటించని రెవెన్యూ అధికారులు



అధికారులు, సిబ్బంది రాకపోవడంతో వెలవెలబోతున్న ఎల్లారెడ్డి తహసీల్దార్ గది



డిప్యూటీ తహసీల్దార్ చాంబర్



అధికారులు లేకపోవడంతో ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తున్న మహిళలు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 17: ఎల్లారెడ్డి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌తో కలిపి 16మంది ఉద్యోగులు ఉండగా, సోమవారం 11 గంటల వరకూ ముగ్గురికి మించి విధుల్లో లేకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా వెలవెలబోయాయి. తహసీల్దార్ సెలవులో ఉండగా, గిర్దావర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వాణి, మరొక్క ఉద్యోగి మాత్రమే విధులకు హాజరయ్యారు. కార్యాలయంలో పని ఉండి వచ్చిన వృద్ధురాలు తను ఈ గది, ఆ గది అంటూ ఆఫీసు అంతా తిరగాల్సివచ్చిందని చివరకు ఎవరూ లేకపోవడంతో, తనకు ఆరోగ్యం బాగాలేకున్నా ఏం చేయాలో తెలియక అలాగే నిలబడ్డానన్నారు. అధికారులు ఇకనుంచైనా సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 'ఆశ'లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట/లింగంపేట(తాడ్వాయి)/ బాన్సువాడ/బిచ్కుంద, మార్చి 17: ఆశవర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం 18వేల రూపాయలను అందించాలని, తమ ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ఇన్‌చార్జి తహసీల్దార్ చరణ్‌సింగ్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు మంజుల, సంధ్య, అంజమణి, లావణ్య, సంగమణి, సునంద, బాలమణి, సీత, మాధవి, సుజాత, సాయవ్వ, పద్మ, సుశీల ఉన్నారు. పని భారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆశ కార్యకర్తలు లింగంపేట నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడ్వాయి తహసీల్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఆయా గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని బాన్సువాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎండీ ఖలీల్, ఆశ వర్కర్స్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జుక్కల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు జుక్కల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.



తాడ్వాయి తహసీల్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు

## సామాన్య ప్రజలందరికీ న్యాయం అందాలి



నూతన డీఎస్పీకి మొక్కను బహుకరిస్తున్న బదిలీపై వెళ్లిన డీఎస్పీ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 17: పోలీస్ స్టేషన్లను నమ్ముకొని వచ్చిన సామాన్య ప్రజలకు న్యాయం అందాలన్నదే తన లక్ష్యమని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న ప్రస్తుత డీఎస్పీ శ్రీనివాసులు నుంచి ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి బేధాలు లేకుండా న్యాయం అందించడమే తమ కర్తవ్యమని అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు స్థానిక సీఐ రవీందర్‌నాయక్ పూలమొక్కను అందించి డీఎస్పీకి స్వాగతం పలికారు. నూతన డీఎస్పీని ఎల్లారెడ్డి, సదాశివనగర్ పోలీస్ సర్కిల్ పరిధిలోని పలువురు సీఐ, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిశారు.

## కానిస్టేబుళ్లు అంకితభావంతో పనిచేయాలి

నిజాంసాగర్/మద్నూర్/పెద్దకొడప్‌గల్(పిట్లం)/బిచ్కుంద (జుక్కల్), మార్చి 17 : కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు అంకితభావంతో పనిచేయాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర పేర్కొన్నారు. నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. మండలంలోని గ్రా మాల జనాభా, క్రైంరేటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాజేశ్, ఎస్సై శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు. మద్నూర్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఎస్పీ రాజేశ్‌చంద్ర సందర్శించారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నరేశ్, ఎస్సై విజయ్‌కొండ, సిబ్బంది ఉన్నారు. పెద్ద కొడప్‌గల్, పిట్లం పోలీస్ స్టేషన్లను ఎస్పీ రాజేశ్‌చంద్ర సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. రికార్డుల్లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని నమోదు చేయాలని ఎస్సైలకు సూచించారు. బిచ్కుంద, జుక్కల్ మండల కేంద్రాల్లోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రాజేశ్‌చంద్ర సందర్శించారు.



బిచ్కుందలో చిల్డ్రన్స్ పార్కును ప్రారంభిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

### సైబర్ నేరాలపై

## అప్రమత్తంగా ఉండాలి

గాంధారి, మార్చి 17: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాజాత బృందం ఇన్‌చార్జి ప్రభాకర్ అన్నారు. మండలంలోని చద్మల్‌తండా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు కల్పించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. షీటీం, ఏహెచ్‌టీయూ గురించి వివరించారు. ఆడపిల్లలను ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా 8712686094 నంబర్‌కు ఫోన్ చేసి, షీ టీం సభ్యులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 108, 1930, 181 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, గాంధారి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాసర ఆలయాన్ని సందర్శించుకున్న విద్యార్థులు



బాసర సరస్వతీ ఆలయం వద్ద గాంధారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

గాంధారి, మార్చి 17: పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యారులను ఉపాధ్యాయులు సోమవారం విహారయాత్రకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాసర సరస్వతీ ఆలయంతో పాటు అలీసాగర్, సారంగాపూర్ పాల శీతలీకరణ కేంద్రాన్ని చూపించారు. హెచ్ఎం రంగా వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. పురాతన ఆలయాలు, చారిత్రక కట్టడాలు, దర్శనీయ స్థలాలు చూపించడం ద్వారా విద్యార్థులకు వాటిపై అవగాహన కలుగుతుందని తెలిపారు.

### కరాటేలో ఆలిండియా

## చాంపియన్ ట్రోఫీ గెలిచిన విద్యార్థినులు

నాగిరెడ్డిపేట, మార్చి17: నాగిరెడ్డిపేట కేజీబీవీ విద్యార్థినులు మేడ్చల్ సుమంగళి గార్డెన్‌లో ఆదివారం యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే అకాడమీ అసోసియేషన్ నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో గోపాల్‌పేట కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు 17 బంగారు పతకాలు, చాంపియన్ ట్రోఫీని గెలిచినట్లు పాఠశాల ప్రత్యేకాధికారి గీత తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన 17 మంది పాల్గొని, స్పారింగ్ విభాగంలో 17 బంగారు పతకాలు సాధించారన్నారు. దీంతోపాటు చాంపియన్ ట్రోఫీని సైతం సొంతం చేసుకున్నట్లు చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థినులు, కరాటే మాస్టర్ యాదగిరి, పీడీ శోభను పాఠశాల సిబ్బంది అభినందించారు.

## పాలకవర్గ పదవీకాలం పెంపుపై హర్షం

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 17: పాలకవర్గ పదవీకాలాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినందుకు ప్రభుత్వానికి సొసైటీ చైర్మన్ ఏగుల నర్సింహులు, వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సొసైటీ పాలకవర్గ పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పాలకవర్గంతో పాటు సిబ్బందికి మెమెంటోలు అందజేశారు. అనంతరం సొసైటీ పాలకవర్గాలకు 6నెలల పదవీ కాలం పెంచడంతో వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మిత్రుడికి ఆర్థిక సాయం

పెద్ద కొడప్‌గల్, మార్చి 17 : ఆపదలో ఉన్న మిత్రునికి ఆర్థిక చేయూతను అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు తోటి మిత్రులు. మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన ఎర్రోల ప్రకాశ్‌కు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. అతడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. 2006 బ్యాచ్ ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు, సీనియర్ మిత్రులు, ఉపాధ్యాయులు రూ.9వేలు సేకరించి ప్రకాశ్‌కు సోమవారం అందజేశారు.

## రుచికరమైన భోజనం అందించాలి

లింగంపేట(తాడ్వాయి), మార్చి17: పాఠశాల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎస్ఎంసీ కమిటీ సభ్యులు వంట ఏజెన్సీ నిర్వాహకురాలికి సూచించారు. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను వారు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం సంగుబాయి తదితరులు ఉన్నారు.

## ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

లింగంపేట, మార్చి17: ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని హెచ్ఎం వసుధ విద్యార్థులకు సూచించారు. మండలంలోని శెట్పల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సోమవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన కేతావత్ దేవీసింగ్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్, పర్సులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజయ్య, రవి, ప్రదీప్, రజిత, అశోక్, ప్రవీణ్, సంతోష్, రాజేశ్ పాల్గొన్నారు.

## పాఠశాల స్కావెంజర్‌కు సన్మానం

ఎల్లారెడ్డిరూరల్, మార్చి 17: మండల పరిధిలోని అడ్విలింగాల్ ఉన్నత పాఠశాలలో స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న భాగ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మహేందర్‌గౌడ్.. స్కావెంజర్ భాగ్య, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు నూతన వస్త్రాలను బహూకరించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శివ నర్సింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.